
# దర్శకధీరుడి క్లారిటీ..



మహేశ్‌బాబు, రాజమౌళి కాంబినేషన్ అనుకున్నప్పటినుంచీ.. ఈ సినిమాపై ఏ చిన్న విషయం బయటకొచ్చినా క్షణాల్లో వైరల్‌గా మారుతున్నది. కొందరైతే.. ఉన్నవీ లేనివీ కూడా కల్పించుకొని మరీ ఈ సినిమాపై వార్తలు రాసేస్తున్నారు. ఈ సినిమాకు 'మహారాజ్' అనే టైటిల్ ఖరారు చేశారనే వార్త రీసెంట్‌గా సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అయింది. ఇలాంటి వార్తలన్నింటికీ చెక్ పెట్టేశారు దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి. తాజాగా ఆయన బళ్లారిలోని అమృతేశ్వర ఆలయ ప్రారంభోత్సవానికి కుటుంబసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్ సినిమా గురించి అక్కడి మీడియాతో మాట్లాడారు. 'మహేశ్‌తో సినిమా చేస్తున్నా. త్వరలోనే షూటింగ్ మొదలుకానుంది. పేరైతే ఇంకా ఫైనల్ కాలేదు.' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియోను బాగా వైరల్ అవుతున్నది. ఇక ఈ సినిమా విషయానికొస్తే.. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో సాగే ట్రెజర్ హంట్ మూవీగా దర్శకధీరుడు ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడనేది విశ్వసనీయ సమాచారం. మిగతా వివరాలు తెలియాల్సివుంది.



# ఆధ్యాత్మిక థ్రిల్లర్‌లో మిల్కీబ్యూటీ

2022లో ఓటీటీలో విడుదలైన క్రైమ్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వేస్టేషన్'. దర్శకుడు సంపత్‌నంది కథను అందించగా, అశోక్‌తేజ దర్శకత్వం వహించారు. ఆ సినిమాకు సీక్వెల్‌గా 'ఓదెల2' పేరుతో ఇప్పుడు మరో సినిమా రానుంది. తమన్నా భాటియా ఇందులో ప్రధానపాత్రధారి. తొలిభాగానికి దర్శకుడైన అశోక్ తేజనే ఈ సినిమాకు కూడా దర్శకుడు. సంపత్‌నంది టీమ్ వర్క్స్, మధు క్రియేషన్స్ పతాకాలపై డి.మధు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం కాశీలో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశాన్ని తమన్నాపై మేకర్స్ చిత్రీకరించారు. 'ఓదెల2' థ్రిల్లింగ్ కలిగించే కథ అని, సంస్కృతి, సంప్రదాయాలలోపాటు ఓదెల మల్లన్నస్వామి ఓ గ్రామాన్ని దుష్టశక్తులనుంచి ఎలా రక్షించాడనేది ఈ కథలో ఆసక్తికరమైన అంశమని, ఆధ్యాత్మికతతో కూడిన థ్రిల్లర్ సినిమా ఇదని, వీఎఫ్ఎక్స్ సినిమాలో టాప్ క్లాస్‌గా ఉండబోతున్నాయని మేకర్స్ చెబుతున్నారు. హెబ్బాపటేల్, వశిష్ట ఎన్ సింహా ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్., సంగీతం: రజనీష్ లోక్‌నాథ్.

# నేషనల్ క్రష్ కాదు.. ఇంటర్నేషనల్ క్రష్..

రష్మిక ఇమేజ్ దేశం దాటి ఇప్పుడు విదేశాలకు కూడా పాకినట్టుంది. 'పుష్ప', 'యానిమల్' చిత్రాలతో ప్రపంచవ్యాప్త గుర్తింపు సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ.. క్రంచీరోల్ అనిమీ అవార్డ్స్ ఫంక్షన్‌లో మన దేశం తరపున పాల్గొనేందుకు జపాన్‌లోని టోక్యోకి వెళ్లింది. అంతే.. టోక్యో ఎయిర్‌పోర్ట్‌లో రష్మికకు అక్కడి అభిమానులు బ్రహ్మరథం పట్టారు. రష్మిక ఫొటోలతో డిజైన్ చేసిన ప్లకార్డులను చూపిస్తూ.. రష్మికకు గ్రాండ్ వెల్కం చెప్పారు. ఈ పరిణామాన్ని చూసి రష్మిక ఆశ్చర్యానికి లోనైంది. ఇక్కడ కూడా ఇంతమంది అభిమానులున్నారంటే నమ్మలేకపోతున్నానంటూ ఆనందం వెలిబుచ్చింది. గ్లోబల్ ఈవెంట్‌గా జరుగుతున్న ఈ అవార్డుల కార్యక్రమంలో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం రష్మికను వరించింది. ఈ గౌరవం దక్కించుకున్న తొలి నటిగా రష్మిక నిలవడం నిజంగా గర్వకారణం.



# నక్షత్రాలను ఏకం చేస్తున్న కల్కి




'కల్కి 2898 ఏడీ' సినిమా విషయంలో ఎప్పటికప్పుడు క్రేజీ అప్‌డేట్లు వస్తూనే ఉన్నాయి. రీసెంట్‌గా స్టార్ రైటర్ సాయిమాధవ్ బుర్రా ఈ సినిమా గురించి మాట్లాడారు. 'ఇప్పటివరకూ తెలుగులో ఇలాంటి కథతో సినిమా రాలేదు. ఇది పాన్ ఇండియా సినిమా కాదు.. పాన్ వరల్డ్ సినిమా. ఇండియన్ టాప్‌స్టార్స్ అయిన అమితాబ్, కమల్‌హాసన్, ప్రభాస్‌లకు మాటలు రాసే అదృష్టాన్ని నాకు ఇచ్చింది ఈ సినిమా' అని చెప్పారు. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటాయి. ఇందులో కథానాయికగా దీపిక పదుకోన్ నటిస్తున్న విషయం తెలిసిందే. అలాగే దుల్కర్ సల్మాన్, పశుపతి, దిశాపటానీ ఇలా పెద్ద పెద్ద స్టార్లు ఇందులో భాగం అయ్యారు. నటకిరీటి రాజేంద్రప్రసాద్ కూడా ఇందులో ఓ కీలక పాత్ర పోషించారనేది తాజా వార్త. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే వెల్లడించారు. 'సినిమా నిర్మాణాల్లో చాలా మార్పులు వచ్చాయి. వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారు. ఆ అంకెలు వింటేనే భయమేస్తుంది. తాజాగా ప్రభాస్ 'కల్కి' సినిమాలో నటించాను. అలాగే మహేశ్‌బాబుతో కూడా ఓ సినిమా చేస్తున్నాను' అని తెలిపారు రాజేంద్రుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. మే 9న సినిమా విడుదల కానుంది. ఈ లోపు ఇంకెంత మంది ఈ ప్రాజెక్ట్‌లో చేరతారో చూడాలి.



# కలియుగం పట్టణంలో ఏంజరిగింది?

విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'కలియుగం పట్టణంలో'. రమాకాంత్‌రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వబాధ్యతతోపాటు కథ, కథనం, మాటలు కూడా అందించారు. కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్ నిర్మాతలు. ఈ నెల 22న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డా.రాజేంద్రప్రసాద్, దర్శకుడు నక్కిన త్రినాథరావు చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'ఆ నలుగురు' సినిమాలో బాలనటుడిగా నటించిన విశ్వకార్తికేయ ఈ సినిమాతో హీరోగా పరిచయమవుతుండటం పట్ల రాజేంద్రప్రసాద్ ఆనందం వెలిబుచ్చారు. సినిమాపై ప్రేమతో నిర్మాతగా మారానని, రామాకాంత్ అద్భుతమైన కథతో ఈ సినిమాను మలిచాడని, సాంకేతికంగా సినిమా అద్భుతంగా ఉంటుందని నిర్మాత కందుల చంద్రఓబుల్‌రెడ్డి తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

# సామాన్యులతో సూపర్‌స్టార్ ప్రయాణం



మిగతా హీరోలతో పోల్చి చూస్తే రజనీకాంత్ జీవనశైలి భిన్నం. వయసు మీద పడుతున్నా కుర్రాళ్లలా కనిపించడానికి చాలామంది హీరోలు ప్రయత్నిస్తుంటారు. రజనీ అలాకాదు. ఇంట్లో ఎలా ఉంటారో, బయటా అలాగే ఉంటారు. తలకు రంగేయడం, వయసు దాచేయడం ఆయన హిస్టరీలో లేదు. రజనీ పారితోషికం వందకోట్ల పైమాటే. కానీ లగ్జరీలకు పోరు. సామాన్యుడిగా బతకడం.. అందరినీ ఆప్యాయంగా పలకరించడం రజనీస్టైల్. రీసెంట్‌గా చెన్నయ్ నుంచి కడపకు సాధారణ ప్రయాణికుడిగా ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించారు రజనీ. ఆ విమానంలో రజనీని చూసిన జనం సంతోషంతో పొంగిపోయారు. తలైవాను దగ్గరగా చూస్తూ తెగ సంబరపడిపోయారు. ఆయనేమో అవేమీ పట్టించుకోకుండా ఎయిర్ పాడ్స్ పెట్టుకొని సంగీతాన్ని ఆస్వాదిస్తూ ప్రయాణించారు. ఈ వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఇంతకీ తలైవాకు కడపలో పనేంటి? అనుకుంటున్నారా..? టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీ నటిస్తున్న తాజా చిత్రం 'వెట్టయాన్' చిత్రం షూటింగ్ ప్రస్తుతం కడపలో జరుగుతున్నది. ఆ షూటింగ్ నిమిత్తం ఆయన కడప వెళ్లారు. ఇక 'వెట్టయాన్' విషయానికొస్తే.. అమితాబ్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్ ఇందులో కీలక పాత్రధారులు. ఈ నెలాఖరుకు షూటింగ్ పూర్తి చేయాలనే లక్ష్యంతో చిత్రయూనిట్ పనిచేస్తున్నట్టు తెలిసింది. ఈ సినిమా 'వేటగాడు' పేరుతో తెలుగులో విడుదల కానుంది.

# అమ్మానాన్న ఇబ్బందిపడ్డారు..



'యానిమల్' సినిమాతో రాత్రికి రాత్రి స్టార్ అయిపోయింది త్రిప్తి డిమ్రీ. అందులోని ఆమె పాత్రపై పలు విమర్శలు కూడా తలెత్తాయి. ఇటీవల ఆ పాత్ర గురించి త్రిప్తి మీడియాతో ముచ్చటించింది. 'ఈ రంగంలో పరిధుల్ని పెట్టుకుంటే అనుకున్నది సాధించలేం. ఎవరో ఏదో అనుకుంటారని ఆలోచిస్తూ కూర్చుంటే చేయాలనుకుంది చేయలేం. అందుకే.. 'యానిమల్'కి ఓకే చెప్పాను. అందులో నా శృంగార సన్నివేశాలు చూసి అమ్మానాన్న ఇబ్బందిగా ఫీలయ్యారు. ఆ సన్నివేశం సినిమాకు ఎంత అవసరమో వివరించి చెప్పాల్సొచ్చింది. వాళ్లు అర్థం చేసుకున్నారు. 'యానిమల్' వచ్చాక జనం నన్ను గుర్తుపడుతున్నారు. స్టార్‌గా చూస్తున్నారు. దానికి కారణం నేను నటించిన శృంగార సన్నివేశాలు కావు. నా పాత్రలో ఉన్న ఇంటెన్సిటీ. కథలోని పాత్ర కావడంవల్లే నాకీ గుర్తింపు. థ్యాంక్స్ సందీప్‌రెడ్డి వంగా.' అంటూ చెప్పుకొచ్చింది త్రిప్తి డ్రిమీ. ప్రస్తుతం రెండు హిందీ సినిమాలు, రెండు తెలుగు సినిమాలతో బిజీగా ఉందీ అందాలభామ.

# మళ్లీ పుట్టి వచ్చినవా..



చదలవాడ శ్రీనివాసరావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రికార్డ్ బ్రేక్'. చదలవాడ పద్మావతి నిర్మాత. నిహార్, నాగార్జున, రగ్గా ఇఫ్తాకర్ ప్రధాన పాత్రధారులు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ సంతోషం వెలిబుచ్చారు. ఈ చిత్రానికి సంబంధించిన రెండవ పాటను చిత్రబృందం విడుదల చేశారు. 'మళ్లీ పుట్టి వచ్చినవా..' అంటూ సాగే ఈ పాటను వరికుప్పల యాదగిరి రాసి, ఆలపించారు. సాబు వర్గీస్ స్వరపరిచారు. పాన్ ఇండియా స్థాయిలో ఎనిమిది భాషల్లో ఈ చిత్రం విడుదల కానుందని, సెన్సార్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తామని చదలవాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ చిత్రానికి కథ: అంజిరెడ్డి శ్రీనివాస్, కెమెరా: కంతేటి శంకర్.